క్లుప్తంగా

యర్రమిల్లిపాడు సచివాలయం తనిఖీ

ఉంగుటూరు : జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ సోమవారం యర్రమిల్లిపాడు సచివాలయా సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్తనుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ కొన్ని మొక్కలు నాటాలని, తడి, పొడి చెత్త విడివిడిగా తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు భవనాలు ఒకే చోట నిర్మించడాన్ని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమాన్విత, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. తిమ్మయ్యపాలెం సంపద సృష్టించే కేంద్రాన్ని కూడా వారు పరిశీలించారు.

లస్కర్ బదిలీ

దెందులూరు: గోదావరి కాల్వ దెందులూరు-గుండుగొలను సెక్షన్ లస్కర్ మూర్తిని ఆ శాఖ జిల్లా అధికారులు బదిలీ చేశారు. ఇటీవల మూర్తిపై దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, గతంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు గోదావరి కాల్వ రెండువైపులా ఆక్రమణలు, గడ్డిసాగు, సిమెంటు స్తంభాలతో ఫెన్సింగ్ ఏర్పాటు, షెడ్ల నిర్మాణం వంటి ఆరోపణలపై గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నేతలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. బదిలీ అయిన లస్కర్ మూర్తి స్థానంలో భీమడోలు మండలం నుంచి లస్కర్‌ను నియమించారు.

రేపు డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

గణపవరం : ఐసీఐసీఐ బ్యాంక్, జవహర్‌నాలెడ్జ్ సెంటర్, గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం గణపవరం మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలకుమారి తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు 26 ఏళ్లలోపు వయస్సు కలిగి 2019 నుంచి 2022 సంవత్సరాల మధ్య డిగ్రీ పూర్తయినవారు, ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు అర్హులని తెలిపారు. వార్షికవేతనం రూ.2.13 లక్షల నుంచి రూ.2.60లక్షల వరకూ ఉంటుందన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

పెదపాడు: నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. సోమవారం పెదపాడు జూనియర్ కళాశాలలో నాడు- నేడు పనులను ఆయన పరిశీలించారు. నిధులను సక్రమంగా వినియోగించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వరావు కోరారు. తరగతి గదులు లేక అవస్థలు పడుతున్నామన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ అన్నారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కళాశాలలో కట్ చేసారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతమనేని వ్యాఖ్యలన్నీ అవాస్తవాలే

పెదపాడు: చింతమనేని ప్రభాకరరావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తెలిపారు. చింతమనేని ఆసుపత్రిలో పోలీసులపై దుర్భాషలాడంతో అరెస్టు చేశారని తెలిపారు. దీనిని కప్పిపుచ్చేందుకు టీడీపీ కార్యాలయంలో ఆయన చొక్కా చింపివేశారని, రౌడీయిజం చేశారంటూ ప్రెస్‌మీట్‌లో అవాస్తవాలు చెప్పారని ప్రసాదరావు విమర్శించారు. ఆయన ఒక 420 అని అందరికీ తెలుసునన్నారు. కల్లబొల్లి మాటలు చెబితే వినేవారు ఎవరూ నియోజకవర్గంలో లేరన్నారు. అలజడి, అల్లరి సృష్టించి రోడ్డుకు ఎక్కడం తద్వారా ప్రజల్లో సానుభూతి పొందాలని అనుకోవడం ఆయనకు పరిపాటేనన్నారు. 420లను అదుపులో ఉంచి, ప్రజలకు రక్షణ కల్పించడం పోలీసుల బాధ్యతని ప్రసాదరావు చెప్పారు.

చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి ప్రజలు బలి

దెందులూరు: ప్రజల ప్రాణాలకు చంద్రబాబునాయుడు విలువ ఇవ్వడం లేదని, కేవలం ఆయన ప్రచార ఆర్భాటం కారణంగానే అనేక మంది తొక్కిసలాటలో బలవుతున్నారని ప్రజాప్రతినిధులు, బీసీ,ఎస్సీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఏలూరు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటాప్రసాదరావు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పళ్ళెం ప్రసాద్, ఎం. సూర్యనారాయణ, ప్రభాకరరావు, పార్టీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి ఏపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. ఇకనైనా చంద్రబాబు తీరు మార్చుకోవాలన్నారు.

4న జేఎన్‌టీయూ హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్

దెందులూరు: మండలంలోని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 8 జిల్లాల్లోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సెలెక్షన్స్‌లో పాల్గొంటారని, ప్రతిభ చాటిన క్రీడాకారులు తమిళనాడులోని పెరియార్ వర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



గోపీనాథపట్నంలో ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించిన దృశ్యం



భీమడోలులో స్వామి వారిని దర్శించుకున్న జెడ్పీటీసీ భవానీ రంగ, సర్పంచ్ సునీతామాన్‌సింగ్ తదితరులు



గణపవరంలో ఉత్తరద్వారం ద్వారా దర్శనం చేసుకుంటున్న భక్తులు



భీమడోలులోని వేంకటేశ్వర స్వామి వారికి టేకు పల్లకీని బహూకరించిన భక్తులు



ఉంగుటూరు వెంకటేశ్వరాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

భీమడోలు : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. సోమవారం తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. దక్షిణాభిముఖుడైన శ్రీవేంకటేశ్వర స్వామి వారు ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ ధర్మశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైకుంఠ ఏకాదశి కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భీమడోలులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ ఈవో ఎం.రాధ, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారి బృందావనం పవన్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారిని జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు. ఆలయంలోని స్వామి వారికి ఎం.నాగులపల్లి మాజీ సర్పంచ్ తూంపాటి రాధాకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు టేకు పల్లకీని బహూకరించారు. గుండుగొలనులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో డి.శంకరరావు ఆధ్వర్యంలో దేవస్థానం పాలకవర్గ సభ్యుడు చిలువూరి సత్యనారాయణరాజు, ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఆలయ మాజీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, పెద్దలు, భక్తులు స్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

గణపవరం మండలంలో...

గణపవరం : గణపవరంలోని ప్రసిద్ధ సువర్ణేశ్వర స్వామి, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయ ఆలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయాలను పూల దండలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సరిపల్లె, కొత్తపల్లి, పిప్పర, అర్ధవరం, జల్లికాకినాడ, కేశవరం, కాశిపాడు, ముప్పర్తిపాడు, కొందేపాడు తదితర గ్రామాలలో భక్తులు ఉత్తరద్వారం గుండా దైవదర్శనం చేసుకున్నారు.

ఉంగుటూరు మండలంలో...

ఉంగుటూరు : ముక్కోటి ఏకాదశిని ఉంగుటూరు మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా జిల్లాలోనే పేరుగాంచిన గోపినాథపట్నం ఆలయంలోని ఆంజయనేయస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. సోమవారం వేకువజాము నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వివిధ భజన సంఘాలు తమ భజనలతో భక్తులను ఆకట్టుకున్నాయి. గోపూజ, సహస్రదీప పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. లక్షతమలపాకులతో ఆంజనేయస్వామికి అర్చన నిర్వహించారు. శ్రీరామపట్టాభిషేక హోమం, జయాది హోమం, పూర్ణాహుతి జరిపారు. అనంతరం జరిగిన చాగంటి కోటేశ్వర రావు ఆధ్యాత్మిక ప్రవచనంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. గోపీనాథపట్నం, తిమ్మయ్యపాలెం, కృష్ణంపాలెం, కొత్తగూడెం, గోపాలపురం, గొల్లగూడెం, పెరుగ్గూడెం నుంచి వచ్చిన భజన సమాజం వారు ఉదయం నుంచి రాత్రి వరకు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఆంజనేయస్వామి పూజా కార్యక్రమాలను రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొట్టు సత్యనారాయణ తనయుడు విశాల్, సోదరుడు కొట్టు మురళి, కుటుంబీకులు పర్యవేక్షించారు. పెద్దత్తున వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

నిరుద్యోగ యువతకు మూడు నెలల శిక్షణ

పెనుగొండ: నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కిల్ హబ్ పర్యవేక్షణలో ఆచంట ఐటీఐలో రెండు కోర్సుల్లో మూడు నెలలు శిక్షణ నివ్వనున్నట్లు ప్రిన్సిపాల్ యిందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ ఇంజనీరు ఎయిర్ కండీషనర్ కోర్సుల్లో నాన్ రెసిడెన్షియన్ శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణ కాలంలో టెక్నికల్ శిక్షణతో పాటు, ఇంగ్లీషు, కంప్యూటర్స్, ఇంటర్వ్యూ, స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణనిస్తామన్నారు. అనంతరం ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉండి, 8, 9, 10 తరగతులు, ఐటీఐ డిప్లొమో, ఇంటర్మీడియట్ పాస్/ ఫెయిల్ అయినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగిలిన వివరాలకు సెల్: 9490111002, 08814299769 సంప్రదించాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



చానమిల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గణపవరం : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈవో పుచ్చల శేషు, పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. గణపవరం, నిడమర్రు మండలాలలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో సోమవారం ట్యాబ్‌లు అందచేశారు.

ఆధునిక సాంకేతికతతో విద్యాబోధన

- విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- విషయ పరిజ్ఞానం పెంపొందేందుకు దోహదం

మండలం	పాఠశాల	ట్యాబ్‌లు	విద్యార్థులు
దెందులూరు	10	706	630
పెదవేగి	75	735	8,753
పెదపాడు	56	712	712
ఏలూరు	55	856	856



దెందులూరు ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆధునిక విద్యా విధానంలో పేద విద్యార్థులు దీటుగా పోటీ పడేవిధంగా సాంకేతికతతో కూడిన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. విద్యార్థులకు 8వ తరగతి నుంచే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించి చర్యలు ప్రారంభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు మన బడి, అమ్మ ఒడితో పాటు విద్యకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు వారు ఉన్నత స్థానానికి చేరుకోవాలనే ఉద్దేశ్యంతో ట్యాబ్‌లను అందిస్తున్నారు. బైజ్యూస్ ద్వారా బోధనా పాఠ్యాంశాలను నూతన విధానంలో వివరించి ట్యాబ్‌లో పొందుపర్చారు. పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన ట్యాబ్‌లను పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరి అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉన్నత విద్యావేత్తల సూచనలు, సలహాలతో సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం



మారుతున్న కాలం పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం మాకు చాలా అవసరం. సాంకేతిక పరిజ్ఞానంతో విద్య అందించడం ఎంతో ఉపయోగపడుతుంది. ట్యాబ్‌లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– సొంగా జోష్‌బాబు, అప్పనవీడు ఉన్నత పాఠశాల

విద్యార్థులందరికీ ట్యాబ్‌ల పంపిణీ



పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌ల పంపిణీ చేస్తున్నాం. ట్యాబ్‌లను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చేతులు మీదుగా అందజేస్తున్నాం. మిగిలిన వారికి త్వరలోనే ట్యాబ్‌లు అందిస్తాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన సత్ఫలితాలనిస్తుంది. – సీహెచ్ బుద్దావ్యాస్, ఎంఈఓ

విద్యార్థుల ఉన్నతి కోరే సీఎం జగన్



పాఠశాల విద్యార్థుల ఉన్నతి కోరే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు-నేడు, అమ్మ ఒడితో పాటు అనేక పథకాలు అమలు చేస్తున్నారు. 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– యశ్వసిని, దెందులూరు ఉన్నత పాఠశాల

ట్యాబ్‌లు ఇస్తారని ఊహించలేదు



పాఠశాలల్లో ట్యాబ్‌లు ఇస్తారని ఊహించలేదు. 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు ఇవ్వడం తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు అందరూ సంతోషంగా ఉన్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం మెరుగవుతుంది.

– నాగమాణిక్యం, దెందులూరు ఉన్నత పాఠశాల

జగన్ మావయ్యకు థాంక్యూ



ప్రభుత్వం సమకూర్చిన షూ, పుస్తకాలు, బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం అందాయి. ఇప్పుడు పాఠ్యాంశాలతో కూడిన ట్యాబ్ కూడా ఇచ్చారు. జగన్ మావయ్యకు థాంక్యూ.

– గోవాడ అనంత సతీష్, కొవ్వలి ఉన్నత పాఠశాల

రైతు వాణి డైరీ ఆవిష్కరణ



వట్లూరు రైతువాణి డైరీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి

పెదపాడు: ప్రభుత్వం రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశ్యంతో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందని వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన మన రైతు వాణి 2023 డైరీని వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి వట్లూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ 2023లో రైతాంగానికి మేలు జరగాలని ఆకాంక్షించారు. మన రైతు వాణి వ్యవసాయ మాస పత్రిక ద్వారా రైతులకు వ్యవసాయంలో మెలకువలు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు సంఘం అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఏలూరు జిల్లా పరిధిలో ఉద్యాన పంటలు వ్యాపార పంటలు, ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వట్లూరు సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల శివరామకృష్ణ, గుజ్జుల నవీన్, డీవీ సుబ్బారావు, చింతా మధు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదపాడు: పేకాట స్థావరాలపై దాడి చేసి 12మందిని అరెస్టు చేసినట్లు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని కొత్తూరు, పెదపాడు గ్రామాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో దాడి చేసారు. కొత్తూరులో పేకాట ఆడుతున్న ఐదుగురిని, పెదపాడులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు.

భీమడోలులో వీఆర్ఏల ఆందోళన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలు

భీమడోలు : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వీఆర్ఏలను కించపర్చుతూ చేసిన వ్యాఖ్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం భీమడోలు తహసిల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు తీసుకువెళ్లే వీఆర్వోలు, వీఆర్ఏలను కించపర్చుతూ వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు.అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ షంషూద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.శంకర్, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తేరా రాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం : కొద్ది రోజులుగా జ్వరాల వ్యాప్తితో సతమతమవుతున్న గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామంలో నాలుగోరోజు సోమవారం ఫీవర్‌సర్వే నిర్వహించి, వైద్యశిబిరం కొనసాగించారు. జ్వరాలపై ఇంటింట సర్వే జరిపారు. గ్రామంలో సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను కొనసాగించారు. రోడ్లపక్కనున్న చెత్తచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లారు. క్రిమిసంహారక రసాయనాలను పిచికారి చేయించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని, కాయిల్స్, దోమతెరలు వాడాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.శ్రీదివ్య ప్రజలకు సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల ఆవరణలోనూ, చుట్టుపక్కల మురికి గుంటలు లేకుండా లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ లక్షణాలపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి, మలేరియా, టైఫాయిడ్, డెంగీ లక్షణాలు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ పిల్లి సంతోషం, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



ఎస్.కొత్తపల్లిలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు

పెదపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు మొత్తాన్ని రూ.2,750 పెంచారని పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని సత్యవోలులో, ఎస్ కొత్తపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి దశల వారీగా పింఛను రూ.3వేలు అందిస్తామని చెప్పారని, చెప్పిన మాదిరిగానే నేడు రూ.2750 అందిస్తున్నారని గుర్తు చేసారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సత్యవోలు సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, ఎస్ కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగరావు, సొంగల మహేశ్వరరావు, ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఐటీయూ సభలకు తరలివెళ్లిన కార్మికులు

భీమడోలు : భీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు సోమవారం మండలం నుంచి వివిధ శాఖల్లో పని చేస్తున్న వారంతా తరలి వెళ్లారు. జాతీయ రహదారి పూళ్ల నుంచి బయలుదేరిన బస్సులకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. లింగరాజు జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, ఎండీఎం కార్మికులు, సివిల్ సప్లయిన్ కార్మికులు, రైస్‌మిల్లు, పరిశ్రమల కార్మికులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సభకు కేరళ న్యాయశాఖ మంత్రి పి.రాజీవ్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విధిగా హాజరవుతారని లింగరాజు తెలిపారు. మండలం నుంచి 500 మంది స్వచ్ఛందంగా బయలుదేరి వెళ్లారన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.సాల్మన్‌రాజు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వయం సహాయ సంఘాల సభ్యులకు శిక్షణ

ఉంగుటూరు : ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ ద్వారా లబ్ధిపొందిన మహిళలకు ఆయా మండలాల సీసీలకు, ఏపీఎంలకు సోమవారం ఉంగుటూరులో శిక్షణా సమావేశం నిర్వహించారు. డీఆర్‌పీ కేవీ సుధీర్, డీపీఎం విజయ్‌కుమార్, ఉంగుటూరు ఏపీఎం పద్మావతి శిక్షణ ఇచ్చారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి స్వయం సహాయ సంఘ సభ్యులు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.